

విజయోత్సవ ర్యాలీలు

## నిర్వహించిన వారిపై కేసు నమోదు


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం | 12 డిసెంబర్ 2025 | ■ 10 పేజీలు


## వెల్లివిరిసిన ఓటరు చైతన్యం

# పోలింగ్ ప్రశాంతం



ఈ చైతన్యం ఆదర్శనీయం



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి విడత పంచాయతీ పోలింగ్ ప్రశాంతం
- కౌంటింగ్ అనంతరం ఫలితాల ప్రకటన
- సత్తా చాటిన కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు
- ఉనికి చాటుకున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు
- మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల విజయం
- ఏజెన్సీలో మొదటి విడతలో విభిన్న ఫలితాలు ఇచ్చిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు
- పోలింగ్ సరళిని పరిశీలించిన ఉమ్మడి జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు
- పంచాయతీ పోరులో తొలి విడత పూర్తి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 70 శాతంపైగా పంచాయతీలను కైవసం చేసుకున్నది. ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో సత్తాచాటుకున్నాయి. పార్టీ సింబల్ లేకపోయినప్పటికీ ప్రధాన రాజకీయ పక్షాలు మద్దతు ఇచ్చిన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీపడ్డారు. ఎన్నికలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రాజకీయ పార్టీలకు చెందిన శాసనసభ్యులు సీరియస్‌గా తీసుకొని ప్రచారం చేశారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నియోజక ఇంచార్జీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తమ పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలను గెలిపించుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. ఆశించిన రీతిలోనే అధికార కాంగ్రెస్ పార్టీ మెజారిటీ గ్రామపంచాయతీలను కైవసం చేసుకున్నది. అయితే అనేక చోట్ల బీఆర్ఎస్, బీజేపీ పార్టీ మద్దతుదారులు కూడా గెలుపొందడం ఆ రెండు పార్టీలకు ఊరటను ఇచ్చింది.









ఒక్క ఓటు తేడాతో

### స్వతంత్ర అభ్యర్థి విజయం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఒక్క ఓటతో 'ఆమె'ను గెలుపు వరించింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని వివాదాస్పద గ్రామమైన పరందోలి గ్రామ పంచాయతీ సర్పంచిగా రాఠోడ్ పుష్పలత కేవలం ఒక్క ఓటుతో ప్రత్యర్థి దీలిప్ కాటేపై గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి వెంకటస్వామి ప్రకటించారు.



## రిమ్స్‌లో తల్లీబిడ్డ మృతి

- మగబిడ్డ పుట్టాడన్న ఆనందం.. అంతలోనే ఆవిరి
- ప్రసవ సమయంలో బాలింత, నవజాత శిశువు మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే అంటూ కుటుంబసభ్యుల ఆందోళన
- రిమ్స్‌లో వరుస ఘటనలతో ఆందోళనలో గర్భిణీలు..

10












# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ అఖిల్ మహాజన్

**166 గ్రామ పంచాయతీలలో 938 సిబ్బందితో బందోబస్తు**

**విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు..**

**ఇచ్చోడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ, సిరికొండ, ఉట్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్ ఆరు మండలాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. ఆరు మండలాలలో ప్రత్యేకంగా డీఎస్పీ స్థాయి అధికారులను నియమించి ఎన్నికలను పర్యవేక్షించారు. ప్రతీ మండలంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, సమస్యాత్మక ప్రాంతాలలో స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు నిర్వహించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన అక్కడి పరిస్థితులను, భద్రతా బందోబస్తును, పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ.. సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణనే ప్రాధాన్యంగా తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని, కోడ్ ముగిసిన తరువాత అనుమతి తీసుకోని విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవచ్చన్నారు.



## జైనూర్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఏఎస్పీ

**జైనూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మొదటి విడత జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయడానికి పోలీసు శాఖ విస్తృత చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జైనూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రాన్ని ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ గురువారం సందర్శించారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఏఎస్పీ అక్కడి పరిస్థితులను, భద్రతా బందోబస్తును, పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ.. సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణనే ప్రాధాన్యంగా తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## బీఆర్ఎస్‌లో భారీగా సీపీఐ నాయకుల చేరికలు

**తాండూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలంలోని మాధారం గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు, 50 మందికి పైగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేశారు. పార్టీలో చేరివారిలో మాదారం గ్రామ పంచాయతీకి చెందిన సీపీఐ నాయకులు మలిశెట్టి సత్యనారాయణ, ఆరేపెల్లి శశికుమార్, యూత్ సభ్యులు భీముడు, చరణ్, సౌమ్య ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కుమ్రంభీం జిల్లాలో మొదటి విడతలో 77.07 శాతం పోలింగ్






**కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం నిర్వహించిన మొదటి విడత ఐదు మండలాల పంచాయతీ ఎన్నికల్లో 77.07 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. ఇందులో జైనూర్, 76.84, కెరమెరి 78. 03, లింగపూర్ 71.68, సిర్పూర్ యూ 79.81, వాంకిడి మండలంలో 77.17 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. ఐదు మండలాల్లో మహిళా, పురుషులు 97 వేల 46 ఓట్లు ఉండగా.. 74 వేల. 791మంది పోలింగ్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. జిల్లాలోని కెరమెరి. వాంకిడి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ నితికా పంత్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సందర్శించి.. పోలింగ్ జరుగుతున్న తీరును సౌకర్యాల కల్పన. పోలిస్భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తే కుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన మొదటి విడత పంచాయతీ ఎన్నికలు

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి, కౌంటింగ్ ప్రక్రియను అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 మొదటి విడతలో జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 24 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాలపై ఎస్పీ నితికా పంత్ ఫోకస్

**స్వయంగా పోలింగ్ కేంద్రాల సందర్శన**

**వాంకిడి, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ నితిక పంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం వాంకిడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న భద్రత ఏర్పాటును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అనుచిత కార్యకలాపాలు, గుంపులుగా తిరగడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఈ సమస్యలు తలెత్తేకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి చుట్టు పక్కల 100 మీటర్ల వరకు నలుగురు వ్యక్తులకు మించి ఉండవద్దని.. నిబంధనలు పాటించకుంటే కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఎస్పీ నితికాపంత్ తెలిపారు. ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





## మంచిర్యాల జిల్లాలో మొదటి విడత

# ఎన్నికల ప్రక్రియ పూర్తి

**మంచిర్యాల ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్**





**మంచిర్యాల, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి విడత ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని దొనబండ, సబ్బెపల్లి గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పెద్దంపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే తో కలిసి సందర్శించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. మొదటి విడతలో భాగంగా జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో ఏకగ్రీవం అయిన స్థానాలను మినహాయించి మిగిలిన 81 గ్రామపంచాయతీ సర్పంచ్, 514 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా ఎన్నికల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలింగ్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. 80.04 శాతం ఓటింగ్ జరిగిందని, జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు నిర్వహిం చడం జరిగిందని తెలిపారు. ఈ నెల 14, 17 తేదీలలో జరగనున్న 2వ, 3వ విడతల ఎన్నికలను అధికారులు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భార్య సర్పంచ్, భర్త

## ఉప సర్పంచ్‌గా ఎన్నిక

**ఉట్నూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

సర్పంచ్ ఎన్నికల్లో భార్యాభర్తలు ఇద్దరు సర్పంచ్, ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మండలంలోని లింగోజీ తండా గ్రామానికి చెందిన జాదవ్ మాయ 88 ఓట్ల మెజారిటీతో సమీప అభ్యర్థి జాదవ్ విమల బాయిపై గెలుపొందారు. అదే గ్రామ పంచాయతీలో వార్డు సభ్యునిగా జాదవ్ హరి నాయక్ ఎన్నికై ఉప సర్పంచ్‌గా గెలుపొందారు. గత ఎన్నికల్లో ఇదే గ్రామ పంచాయతీకి జాదవ్ హరి నాయక్ సర్పంచ్‌గా గెలుపొందారు. పంచాయతీలో కీలకమైన పదవుల్లో భార్యాభర్తలు గెలుపొందడం పట్ల ప్రజల ఆశీర్వాదంతోనే పదవులు కట్టబెట్టినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీరాంపూర్‌లో పులి సంచారం

**శ్రీరాంపూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

శ్రీరాంపూర్ ఏరియా ప్రాంతంలోని ఆర్కే 8 మైన్ వద్ద పెద్దపులి కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రజలు రోజువారీ మార్గాల్లో ప్రయాణిస్తుండగా పెద్దపులి సంచారం గుర్తించారు. రామకృష్ణాపూర్ గ్రామస్తులు, మైన్ కార్మికులు అటువైపు వెళుతుండగా పులి ఆకారాలు స్పష్టంగా కనిపించాయి.

## అందరినీ కలుపుకుని అభివృద్ధి వైపు ముందుకు సాగుతా

**ఉంగరం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించండి**

**సర్పంచ్ అభ్యర్థి ఓరగంటి గోపి**



**లోకేశ్వరం, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

కనకాపూర్ గ్రామస్థులందరిని తన స్వంత కుటుంబంలా భావిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని కనకాపూర్ సర్పంచ్ అభ్యర్థి ఓరగంటి గోపి అన్నారు.గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వారి కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.ఒక వార్డు మెంబర్ స్థాయిలో ఉండి ప్రతి ఒక్కరి కష్ట సుఖాల్లో పాల్గొన్న తనను రానున్న ఎన్నికల్లో గ్రామ ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. గతంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని వాటిని గుర్తించి ప్రజలు తనకు మద్దతివ్వాలన్నారు.నేటి వరకు ఎవరిని కించపరిచే భావం తనకు లేదని అన్నీ వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తామని స్పష్టం చేశారు.గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలైనా తాగు నీరు, రోడ్లు, డ్రైనేజీల వ్యవస్థ,గ్రామ పరిశుభ్రత అదేవిధంగా ప్రధాన సమస్యైన ఆసుపత్రి భవన నిర్మాణం గెలిచిన త్వరిత సమయంలోనే అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేస్తున్నారు. అవినీతి రహిత పారదర్శకమైన పాలనకు ప్రాధాన్యతనిస్తానని హామీనిస్తూ ప్రజలు ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీ తో కల్పించాలని విన్నవించారు.

## 27లోగా అంబేద్కర్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించండి



**బెల్లంపల్లి, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లో డిగ్రీ చదువుతున్న 1, 3, 5 సెమిస్టర్ల విద్యార్థులు ఈనెల 27వ తేదీ లోపు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో చదువుతున్న రెగ్యులర్, బ్యాక్లాగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి ఫిబ్రవరిలో జరుగనున్న పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.



**జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన**

## మొదటి విడత ఎన్నికల ప్రక్రియ

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి విడత ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం కొఠారి, వాంకిడి మండలం బెండర గ్రామపంచాయతీలోని నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్.పి. నితిక పంత్, ఎన్నికల పరిశీలకులు వి.శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం జరిగిందని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచిస్తూ పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో పోటీ చేయు సర్పంచ్, వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నారని, జిల్లాలో ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత నమూనాలో నమోదు చేయాలని స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం 1 గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు వరుసలో ఉన్న వారందరికీ ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని, సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవరిని అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ

**ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగిన ఎన్నికల నిర్వహణ వెబ్ కాస్టింగ్ ద్వారా నిచితంగా పర్యవేక్షించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ ద్వారా జిల్లా ఎస్.పి. నితికపంత్, ఎన్నికల పరిశీలకులు వి.శ్రీనివాస్ లతో కలిసి మొదటి విడత ఎన్నికల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు-2025 మొదటి విడతలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరిగిందని, నెట్ వర్క్ లేని పోలింగ్ కేంద్రాలలో వాకీ టాకీ ద్వారా పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అనుచితమైన సంఘటనలు ఏర్పడినా వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# జిల్లాలో ప్రశాంతంగా మొదటి విడత పంచాయతీ ఎన్నికలు

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా - పలు గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్



**ఆదిలాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తిగా శాంతియుతంగా, సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం సిరికొండ, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పోలింగ్ పరిస్థితులను సమీక్షించారు. ముందుగా సిరికొండ మండలం సుంకిడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ శాతం పెరిగేలా, ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వందశాతం పోలింగ్ సాధనే లక్ష్యంగా మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓటరు సహాయ కేంద్రం వద్ద ఓటర్ స్లిప్ పంపిణీపై బూత్ స్థాయి అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. తరువాత ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నమూనా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి పోలింగ్ ప్రక్రియ, సిబ్బంది నిర్వాహణ, లాజిస్టిక్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల పోలింగ్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రశాంతంగా సాగుతోందని తెలిపారు. అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేశామని చెప్పారు. 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, అలాగే ఓటర్ స్లిప్ చూపించి ఓటు వేయవచ్చని, ఈ విషయంపై బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు ముందుగా అవగాహన కల్పించామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి ఓటరును పోలింగ్ బూత్ వద్దకు చేర్చేందుకు యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. సమస్యాత్మక బూత్‌లను ప్రత్యేకంగా గుర్తించి, వాటిలోని పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్ ద్వారా కలెక్టర్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ పరిశీలనలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, సిరికొండ తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవోలు రాయిస్ ఉల్ల, రామ్ ప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్, ఇంద్రవెల్లి ఎంపీడీవో జీవన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.



# ఇచ్చోడలో కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ





**ఇచ్చోడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మొదటి విడత గ్రామపంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లెక్కింపు హాలులో ఏర్పాట్లు, భద్రతా చర్యలు, టేబుళ్ల వారీగా జరుగుతున్న లెక్కింపు విధానాన్ని ఆయన పరిశీలించి అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. పరిశీలనలో ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ సరళిపై కలెక్టర్ రాజర్షి షా సమీక్ష




**ఆదిలాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిస్థితిని వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలించినట్టు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్ క్యాస్టింగ్ మానిటరింగ్ వ్యవస్థను పరిశీలిస్తూ ఆయన అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టితో పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మొత్తం పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సమగ్రంగా సాగేందుకు నిరంతర మానిటరింగ్ అవసరం అని అన్నారు. వెబ్ క్యాస్టింగ్ సహాయంతో ఏదైనా అంతరాయం, సాంకేతిక సమస్యలు, లేదా అసాధారణ కదలికలు గమనించిన వెంటనే ఫీల్డ్ స్థాయి అధికారులను అప్రమత్తం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా సూచించినట్టు వెల్లడించారు. అధికారులు కేంద్రాల వారీగా అందుతున్న వీడియో ఫీడ్‌ను పరిశీలించి అవసరమైన చర్యలను చర్చించారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, ఈడియం రవి, వెబ్ క్యాస్టింగ్ ఆపరేటర్లు, సాంకేతిక బృందాలు పాల్గొన్నారు.

### అభ్యర్థులు, వారి అనుచరులు

# ర్యాలీలు నిర్వహించొద్దు

**అధికారుల అనుమతితోనే నిర్దేశించిన రోజు విజయోత్సవాలు నిర్వహించుకోవాలి**

**విజయానంతరం టపాకాయలను కాల్చవద్దు**

**ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్**

**ఉట్నూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలోని ఆరు మండలాలలో జరుగుతున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలో నిర్వహించరాదని ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్ తెలియజేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియలో విజేతలుగా నిలిచిన అభ్యర్థులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలను నిర్వహించరాదు, వారికి సంబంధించిన వారు కూడా ఎలాంటి విజయోత్సవ ర్యాలీ నిర్వహించరాదు. నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలను నిర్వహించిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని హెచ్చరించారు. విజయాల అనంతరం టపాకాయలను వెలిగించరాదని తెలిపారు. 6 మండలాలలో 936 మంది సిబ్బందితో జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రతిష్టమైన బందోబస్తు చర్యలను చేపట్టిందని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు అనంతరం సంబంధిత అధికారుల వద్ద సరైన నిర్దేశిత రోజున అనుమతులు తీసుకొని రాలీలను నిర్వహించవచ్చని తెలిపారు.









# నిర్మల్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు

నిర్మల్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)

జిల్లాలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ఎటువంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులు సూచించారు. గురువారం కలెక్టర్ మామడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, వరుసలో నిల్చొని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వారికి అందిస్తున్న సౌకర్యాలు తగిన విధంగా ఉన్నాయా అని తెలుసుకున్నారు. దివ్యాంగులకు వీల్‌చైర్ సదుపాయం అందుబాటులో ఉందా అనే విషయంపై అధికారులను ప్రశ్నించారు. పోలింగ్ బూత్‌లను ఒక్కొటిగా పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్నదో లేదో ఆరాతీశారు. ఫారమ్‌లు, రికార్డులు, ఓటింగ్ వివరాలు రియల్ టైమ్‌లో నమోదు చేసి పై అధికారులకు అందజేయాలని సూచించారు. ఓటింగ్ ముగిసిన వెంటనే లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి ఫలితాలను వెంటనే ప్రకటించాల్సిందిగా ఆదేశించారు. పోలింగ్ పూర్తయ్యేంతవరకూ పటిష్ట బందోబస్తు కొనసాగించాలని పోలీస్ అధికారులకు సూచించారు. సహాయ కేంద్రం, వైద్య శిబిరాలను పరిశీలించిన కలెక్టర్, జిల్లాలో ప్రతి అర్హుడూ ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం అని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్లు,తాగునీరు, టెంట్లు, విశ్రాంతి సదుపాయాలు వంటి అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామని వివరించారు. ప్రజలు అందరూ తప్పకుండా గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం...

జిల్లాలో గురువారం జరుగుతున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా, పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పెంబి మండలంలోని ధూమధారి, గుమ్మెణ గ్రామాల్లో, ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి, తర్లపాడ్, గోసంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాలతో పాటుగా, మమడ మండలంలోని దిమ్మదుర్తి గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు తనిఖీ చేశారు. ఎన్నికల సరళిని పరిశీలించి, పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు.

## ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్

గురువారం సాయంత్రం లక్ష్మణచందా మండలం వడ్యాల్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఓటర్లు, పోలైన ఓట్లు, అందులో చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లు, నోటా ఓట్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియ మొత్తాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసిల్దార్ సరిత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులున్నారు.

నిర్మల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిలాష అభినవ్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం, అధికారులు..


























# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



### సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశం

**ఇచ్చోడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది డ్యూటీలు, ఓటర్ల సౌకర్యాలపై సమాచారం సేకరించి, పలు సూచనలు ఇచ్చారు. పోలింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిందిగా కలెక్టర్ సిబ్బందికి ఆదేశించారు. ఎలాంటి టెక్నికల్ ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, నిబంధనల పాటింపు అత్యంత ముఖ్యం అని తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ట్రైనింగ్ కలెక్టర్ సలోని చబ్రా, రిటర్నింగ్ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.





## మంచిర్యాలలో అగ్నిప్రమాదం

**మంచిర్యాల, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గౌతమి నగర్‌లో గల టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఇంటి పైన ఉన్న రేకుల షెడ్డులో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇంటిపైన ఒకేసారి పేలుడు సౌండ్ వినపడిందని.. దీంతో వెంటనే పొగ చెలరేగి మంటలు అంటుకోగా.. అగ్నిమాప శాఖ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారన్నారు. వెంటనే రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదం పై స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రమేష్ బాబును వివరణ కోరగా గదిలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఏసీ పేలడంతో మంటలంటుకున్నాయని, అందులో ఉన్న పాలు సామాగ్రి అగ్నికి ఆహుతైందని తెలిపారు. వాటి విలువ దాదాపు రూ. రెండున్నర లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందన్నారు. సహాయక చర్యల్లో ఫైర్ సిబ్బంది రమేష్ బాబు, రాజేందర్, రమేష్ శ్రీకాంత్, రమేష్, పోలీస్ సిబ్బంది తిరుపతి, రాకేష్ ఉన్నారు.

## వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఉదయ్ బాబు


**ఆసిఫాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అధ్యక్షుడిగా మర్యాల ఉదయ్ బాబు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఏకిరాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పాత శ్రీనివాస్ తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వాసవి మాత మందిరంలో జరిగిన సమావేశంలో వాసవి క్లబ్ 2026 సంవత్సరంనకు నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శిగా బాల శ్రీనివాస్, కోశాధికారిగా కలకుంట్ల శ్రీధర్లను ఎంపిక చేసిన్నట్లు వెల్లడించారు.



# గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి

### ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు
### పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు..

**లక్షెట్టిపేట, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
లక్షెట్టిపేట మండలంలోని 18 గ్రామపంచాయతీలోని 160 వార్డులో జరిగే ఎన్నికలు గురువారం ఉదయం 7:00 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1:00 గంట వరకు ఓటింగ్ కొనసాగనుంది. అనంతరం రెండు గంటలకు అధికారులు ఓట్ల లెక్కింపును ప్రారంభించి. సాయంత్రానికి ఫలితాలు ప్రకటించనున్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 7:00 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1:00 గంట వరకు ఓటింగ్ పూర్తి అవ్వడం. అనంతరం రెండు గంటలకు అధికారులు ఓట్ల లెక్కింపును ప్రారంభించి.. ఇదే రోజు సాయంత్రానికి ఫలితాలు ప్రకటించనున్నారని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా కీలక గ్రామాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేసి పర్యవేక్షణను మరింత బలోపేతం చేశారు. ఈ సారి తొలి విడత ఎన్నికల్లో పోటీ గట్టిగానే ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈసారి సర్పంచ్, వార్డు అభ్యర్థుల మధ్య గట్టిగా పోటీ పడుతున్నారు. జిల్లాలవారీగా అభ్యర్థుల పూర్తి వివరాలను ఎన్నికల కమిషన్ ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటికే మండలం లోని గ్రామపంచాయతీలో పోలైన ఓట్ల సంఖ్య 14026 కాగా పోలింగ్ 55.60% శాతం పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు.



### విజయోత్సవ ర్యాలీలు
## నిర్వహించిన వారిపై కేసు నమోదు

**ఉట్నూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
పంచాయతీ ఎన్నికల్లో గెలుపు నిబంధనలు పాటించనీ వారిపై కేసులు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ గురువారం తెలిపారు. జిల్లాలో ఆరు మండలాలలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలో నిర్వహించరాదని ఇది వరకే ఆదేశాలు జారీ చేశామన్నారు. సర్పంచ్ కౌంటింగ్ ప్రక్రియలో విజేతలుగా నిలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలను నిర్వహించిన కారణంగా ఉట్నూర్ మండలంలోని దంతన్ పల్లి సర్పంచ్ అభ్యర్థి అంకవ్వ భర్త ముచ్చినేని భూమన్న, అనుచరులు కోమటిరెడ్డి మల్లారెడ్డి మరికొందరుపై, ఇచ్చోడ మండలంలోని నవేగాం పంచాయతీలో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థి ముండే పాండురంగ్ వారి 20 మంది అనుచరులపై పోలీస్ ఆక్ట్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.



నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలను నిర్వహించిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని హెచ్చరించారు. విజయాల అనంతరం టపాకాయలను వెలిగించరాదని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు చేయడం నిషేధమని, గెలుపొందిన అభ్యర్థులు అనంతరం సంబంధిత అధికారుల వద్ద సరైన నిర్దేశిత రోజున అనుమతులు తీసుకొని ర్యాలీలు నిర్వహించవచ్చని తెలిపారు.

### ఎన్నికల కోడ్ ముగిసే వరకు
## జిల్లాలో ర్యాలీలు నిషేధం

**నిర్మల్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లా ఎస్పీ జానకి షర్మిల గురువారం మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమని తెలిపారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# మంచిర్యాల జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్

## 81 జీపీలకు, 514 వార్డులకు ఎన్నికలు - 77.34 శాతం పోలింగ్ నమోదు

**మంచిర్యాల, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో 90 గ్రామ పంచాయతీలుండగా ఆరు జీపీలు ఏకగ్రీవం కావడం, మూడు జీపీలకు నామినేషన్లు వేడకపోవడంతో 81 గ్రామ పంచాయతీలకు గురు వారం మెదటి విడుత పంచాయితీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మంచిర్యాల నియోజక వర్గంలోని హాజీపూర్ మండలంలోని 12 జీపీలకు, లక్షెట్టిపేటలోని 18 జీపీలకు, దండేపల్లిలోని 31 జీపీలలో కొండాపూర్, కొత్తమామిడిపల్లి, పాత మామిడిపల్లి, ముత్యంపేట జీపీలు ఏకగ్రీవం కాగా నెల్కి వెంకటాపూర్, గూడెం జీపీలు ఎస్టీలకు కేటాయించగా ఎవరూ లేకపోవడంతో నామినేషన్లు దాఖలు కాలేదు. వందూరుగూడను నూతన జీపీగా మార్చడాన్ని నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరించడంతో మిగిలిన 24 జీపీలకు, ఖానాపూర్ నియోజక వర్గంలోని జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీలుండగా లింగయ్యపల్లి, లోతెర్రె జీపీలకు ఒక్కటొక్కటే నామినేషన్‌లు దాఖలు కావడంతో ఈ రెండు జీపీలు ఏకగ్రీవమవడంతో 27 జీపీలకు ఎన్నికలు జరిగాయి. 81 గ్రామ పంచాయతీలకు 258 (దండేపల్లిలో 75, హాజీపూర్ లో 39, జన్నారంలో 98, లక్షెట్టిపేటలో 46) మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 816 (దండేపల్లిలో 278, హాజీపూర్ లో 106, జన్నారంలో 272, లక్షెట్టిపేటలో 160) వార్డులుండగా 268 (దండేపల్లిలో 103, హాజీపూర్ లో 22, జన్నారంలో111,లక్షెట్టిపేటలో32) వార్డులు ఏకగ్రీవం కాగా 34 వార్డులకు నామినేషన్ లు దాఖలు కాక పోవడంతో 514 (దండేపల్లిలో 143, హాజీపూర్ లో 84, జన్నారంలో 159, లక్షెట్టిపేటలో 128) వార్డులకు ఎన్నికలు జరిగాయి. 1476 (దండేపల్లిలో435,హాజీపూర్‌లో 219, జన్నారంలో 498, లక్షెట్టిపేటలో324) అభ్యర్థులు పోటీ పడ్డారు.

**నెమ్మదిగా ప్రారంభమైన పోలింగ్...**

నాలుగు మండలాల్లో 1,24,019 (దండేపల్లిలో 38,532, హాజీపూర్‌లో 16,954, జన్నారంలో 43,306, లక్షెట్టిపేటలో 25,227) మంది ఓటర్లుండగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైనా ఓటు వేసేందుకు ఓటర్లు నెమ్మదిగా పోలింగ్ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం తొమ్మిది గంటల వరకు దండేపల్లిలో 5,548(14.4 శాతం), హాజీపూర్ లో 3,176 (18.73 శాతం), జన్నారంలో 6,058 (13.99 శాతం), లక్షెట్టిపేటలో 5,794 (22.97 శాతం) ఓట్లు పోలయ్యాయి. నాలుగు మండలాల్లో 20,576 (16.59 శాతం) ఓట్లు పోలవగా తొమ్మిది గంటల తర్వాత ఓట్లు వేసేందుకు ఓటర్లు తరలిరావడంతో ఉదయం 11 గంటల వరకు దండేపల్లిలో 17,845 (46.31 శాతం), హాజీపూర్ లో 9,167 (54.07 శాతం), జన్నారంలో 19,568 (45.19 శాతం), లక్షెట్టిపేటలో 14,026 (55.60 శాతం) అంటే 60,606 (48.87 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు దండేపల్లిలో 28,520(74.01 శాతం), హాజీపూర్ లో 14,376 (84.79 శాతం), జన్నారంలో 32,584 (75.24 శాతం), లక్షెట్టిపేటలో 20,440 (81.02 శాతం) అంటే 95,920 (77.34 శాతం) ఓట్లు పోలయ్యాయి.

**పోటాపోటీగా స్థానిక సంస్థల ఎన్నికలు**

మంచిర్యాల జిల్లా మంచిర్యాల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు పోటాపోటీగా సాగాయి. రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండలంలో నిర్వహించిన మొదటి విడత ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. దండేపల్లి మండలంలోని 31 గ్రామ పంచాయతీలుండగా కొండాపూర్, కొత్తమామిడిపల్లి, పాత మామిడిపల్లి, ముత్యంపేట జీపీలు ఏకగ్రీవం అయ్యాయి. నెల్కి వెంకటాపూర్, గూడెం జీపీలు ఎస్టీలకు కేటాయించగా ఎవరూ లేకపోవడంతో నామినేషన్లు దాఖలు కాలేదు. వందూరుగూడను నూతన జీపీగా మార్చడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించడంతో మిగిలిన 24 గ్రామ పంచాయతీలకు ఎన్నికల అధికారులు పోలింగ్ నిర్వహించారు. 24 జీపీలకు బరిలో 75 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. మండలంలో 34,213 (పురుషులు 16,660, మహిళలు 17,552) మంది ఓటర్లుండగా ఉదయం తొమ్మిది గంటల వరకు 5,548 (16%), 11 గంటల వరకు 17,845 (52%), ఒంటి గంట వరకు 25,520 (74.59%), ఒంటి గంట అనంతరం క్యూలో నిలబడిన వారు ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం పోలింగ్ 27,362 (79.98%)కి చేరుకుంది. మండల వ్యాప్తంగా ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో 12,993 (77.99%) పురుషులుండగా, 14,368 (81.86%) మహిళలు, ఒకరు ఇతరులున్నారు.

**విజయం సాధించిన సర్పంచులు వీరే...**

దండేపల్లి మండలంలో 31 గ్రామ పంచాయతీలకు నాలుగు ఏకగ్రీవం, మూడు జీపీల్లో నామినేషన్ లు వేయకపోవడంతో ఎన్నికల అధికారులు 24 జీపీలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సర్పంచు స్థానాలకు 75 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇందులో కొండాపూర్ గ్రామ సర్పంచిగా ఇప్ప రవళి(కాంగ్రెస్), కొత్త మామిడిపల్లిలో కస్తూరి పోషం(కాంగ్రెస్), మామిడిపల్లిలో ఆల్తపు వైష్ణవి(కాంగ్రెస్), ముత్యంపేటలో కుడిమేత తిరుపతి(కాంగ్రెస్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అల్లీపూర్ జీపీ సర్పంచ్ గా కొత్తపల్లి కళ (కాంగ్రెస్ రెబల్), చెల్కగూడలో ఆత్రం శాంకరి (బీఆర్ఎస్), దండేపల్లిలో అజ్మీరా రాజేశ్వర్ (కాంగ్రెస్), మాకులపేటలో బోడకుంట శంకరయ్య (కాంగ్రెస్), ధర్మరావుపేటలో కొత్త ధర్మయ్య (కాంగ్రెస్), ద్వారకలో ముడిమడిగుల సత్య నారాయణ (కాంగ్రెస్), గుడిరేవులో శాంతపురి కళావతి (కాంగ్రెస్), కన్నెపల్లిలో చుంచు నాగేష్ (కాంగ్రెస్), కర్ణపేటలో అజ్మీరా సుభాష్ (ఇండిపెండెంట్), కొర్విచెల్మలో సారల సోనియా (కాంగ్రెస్), లక్ష్మీకాంతాపూర్ లో చిలుకూరి మహేష్ (కాంగ్రెస్), లింగాపూర్ లో మగ్గిడి శంకరమ్మ (ఇండిపెండెంట్), మేదరిపేటలో చొప్పదండి అనూష (కాంగ్రెస్), నాగసముద్రంలో నందుర్గా సుగుణ (బీజేపీ), నంబాలలో గోపు రాజమల్లు (బీజేపీ), నర్సాపూర్ లో తీగల రాజన్న (కాంగ్రెస్), పెద్దపేటలో పెంట సత్తయ్య (కాంగ్రెస్ రెబల్), రాజుగూడలో జె రాజవ్వ (కాంగ్రెస్ రెబల్), రెబ్బనపల్లిలో కందుల కళ్యాణి (కాంగ్రెస్), తానిమడుగులో మలావత్ నందిని (కాంగ్రెస్), వెల్గానూర్ గ్రామ సర్పంచిగా మొరుపుటాల మానస (బిజెపి), తాళ్ళపేటలో కుర్షింగా కళావతి (కాంగ్రెస్ రెబల్), కాసిపేటలో లక్కాకుల అనితా ( కాంగ్రెస్), చింతపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా అక్కల సత్య నారాయణ (కాంగ్రెస్ రెబల్) గెలుపొందారు. మండలంలో 278 వార్డులకుగాను 103 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 32 వార్డులకు నామినేషన్‌లు దాఖలు కాకపోవడంతో 143 వార్డులకు ఎన్నికలు జరుగగా 435 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. విజయం సాధించిన అభ్యర్థులకు పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు తెలిపారు.



---



### భాదనకుర్తి సర్పంచ్‌గా

## నాడు భర్త.. నేడు భార్య

**ఖానాపూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సర్పంచ్ ఎన్నికలు ఉత్కంఠంగా జరిగాయి. మండలంలోని భాదనకుర్తి గ్రామ సర్పంచ్‌గా నాడు భర్త పార్సపు శ్రీనివాస్‌గా సర్పంచ్ కొనసాగా నేడు అదే గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా శ్రీనివాస్ భార్య యగు పార్సపు రోహిత శ్రీనివాస్ బరిలో ఉండగా.. ప్రత్యూర్తి అభ్యర్థిపై 119 ఓట్లతో గెలిపొందారు. నాడు సర్పంచ్ ఎన్నికైన శ్రీనివాస్ అభివృద్ధి పనులు చేశారని గ్రామ ప్రజలు రు. నాడు ఆయనకు సర్పంచ్‌గా పట్టం గా కట్టగా నేడు అయన భార్యకు గ్రామ సర్పంచ్‌గా పట్టం కట్టారు.

## 60 కిలోమీటర్ల నుంచి వచ్చి ఓటు!

**మంచిర్యాల, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలో రెండు గ్రామాల మధ్య ఎత్తయిన గుట్ట ఉండడంతో కొత్తగడపూర్ గ్రామంలోని ఓటర్లు 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఓటు వేశారు. హాజీపూర్ మండలంలోని చిన్న గోపాల్‌పూర్ పంచాయతీకి వచ్చిన వారంతా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 15 కిలోమీటర్ల దూరం కాలినడకన వచ్చి చిన్న గోపాల్‌పూర్ పంచాయతీలో ఓటేసేవారు.

---

# పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటా

## మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

సేవా గుణం గ్రామమే నేర్పుతుందాని, అదే స్ఫూర్తితో ఎమ్మెల్యేగా, మంత్రిగా రాణించ గలిగానని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తమ అమ్మానాన్నలు జోగు బోజమ్మ- జోగు ఆశన్నల జ్ఞాపకార్థం స్వంత గ్రామం దీపాయి గూడలో పేదల కోసం కాలనీ నిర్మిం చి తీరుతానని పేర్కొన్నారు. పేదల ఇండ్ల కోసం ఇప్పటికే 6 ఎకరాల సొంత భూమిని ఇవ్వడం జరిగిందని, అవసరమైతే మరో 2,3 ఎకరాలను సైతం కొనుగోలు చేసి ఇస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల ప్రచా రంలో బాగంగా గురువారం దీపాయి గూడ లో పెద్దఎత్తున గ్రామస్థులతో కలిసి ఆయన పర్యటించారు. బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి తో పాటు పదిమంది వార్డు సభ్యుల ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ... ఢిల్లీకి రాజైన తల్లికి కొడుకు అన్న విధంగా తాను మంత్రి పదవి స్థాయికి ఎదిగిన, పుట్టిన స్వగ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. దళిత బస్తీ కింద ఎన్నో ఎకరాల భూమిని పేద దళితులకు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. గ్రామ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందించాలని ప్రైమరీ స్కూ తో పాటు హైస్కూల్ హాలో మౌలిక వసతులు కృషి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మౌనిష, నితిన్ రెడ్డి, గంగన్న, కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి అశోక్, గణేష్ పాల్గొన్నారు.



---

# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు : ఎస్పీ నికితా పంత్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఎస్పీ నితికాపంత్ తెలిపారు. ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 750 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు.



# కార్తీ సినిమా రిలీజ్ నిలిపివేత!


గత వారమే సరిగ్గా ఇదే సమయానికి బాలయ్య నటించిన అవైటెడ్ చిత్రం అఖండ 2 చివరి నిమిషం వరకు సస్పెన్స్ మైంటైన్ అవుతూ రిలీజ్ ఆగినట్టు క్లారిటీ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ వారం కూడా మళ్ళీ అదే తరహాలో కోలీవుడ్ నటుడు కార్తీ నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు' కూడా వాయిదా పడినట్టు కన్ఫర్మ్ అయ్యింది.ఈ సినిమాకి కూడా నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ వారికి ఫైనాన్సియల్ సమస్యలు ఉన్నాయని ఈ కారణంగా వాయిదా పడొచ్చు అనే రూమర్స్ వచ్చాయి. సో అవే నిజమయ్యి సినిమా రిలీజ్ అధికారికంగా వాయిదా వేసినట్టు యూఎస్ డిస్ట్రిబ్యూషన్ వారు కన్ఫర్మ్ చేశారు. దీనితో తెలుగు సహా తమిళ్ రెండు భాషల్లోని ఈ సినిమా థియేటర్స్ లో రేపు పడటం లేదట. దీనితో కార్తీ సినిమా కూడా చివరి నిమిషంలో ఆగిపోయింది అని చెప్పాలి. ఇక కొత్త డేట్ ఎప్పుడు వస్తుంది అనేది క్లారిటీ రావాల్సి ఉంది.



# వెంకీ త్రివిక్రం.. ఏకే 47

వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' (ఏకే 47) పేరుని ఖరారు చేస్తూ వెంకటేశ్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. అందులో వెంకటేశ్ క్లాస్‌గా పక్కా ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. కథానాయకుడిగా, దర్శకుడిగా ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న తొలి సినిమా ఇదే. ఇదివరకు వెంకటేశ్ చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పనిచేసిన విషయం తెలిసిందే. ప్రత్యేకమైన ఈ కలయికలో రూపొందుతున్న ఈ కొత్త చిత్రం ఓ కుటుంబ కథతో తెరకెక్కుతోందని పేరునిబట్టే అర్థమవుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వచ్చే ఏడాది వేసవి సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది.





'మోగ్లీ' ఒక రోజు ఆలస్యం

రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మోగ్లీ 2025'. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. ఇటీవలే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్, పాటలు సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి. తాజాగా ఈ నెల 12న రావాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాలతో ఒక రోజు ఆలస్యంగా 13న రానున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే మరో కొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. అటవీ నేపథ్యంలో సాగే ప్రేమకథతో దీన్ని తీర్చిదిద్దారు. హర్ష చెముడు, బండి సరోజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# వరుస సినిమాలతో హెబ్బా బిజీ




హెబ్బా పటేల్ టాలీవుడ్‌లో ఎప్పటి నుండో సినిమాలు చేస్తున్నా సరైన హిట్‌లు అందుకోలేదు.కుమారి 21ఎఫ్ సినిమా ఆమెకు మంచి పేరు తీసుకువచ్చింది.గ్లామర్ రోల్స్, లిప్‌లాక్ సీన్స్ చేయడంలో హెబ్బా ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు.అయినా టాప్ హీరోలతో కలిసి నటించే అవకాశం ఆమెకు రాలేదు. ఓదెల రైల్వే స్టేషన్ లో డీ-గ్లామర్ పాత్ర చేసినా పెద్ద గుర్తింపు రాలేదు.ఓదెల రైల్వే స్టేషన్ లో డీ-గ్లామర్ పాత్ర చేసినా పెద్ద గుర్తింపు రాలేదు.హెబ్బా నటించిన హారర్ మూవీ ఈషా డిసెంబర్ 25న విడుదల కానుంది. ఈషాలో హెబ్బా, హీరో త్రిగుణ్ మళ్లీ జోడీగా కనిపించనున్నారు. డిసెంబర్ 19న థియేటర్లలోకి రాబోతోంది మారియో ఫిల్మ్. వరుసగా రెండు విడుదలలతో హెబ్బా మళ్లీ యూత్ దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నిస్తోంది.

# ఫ్లాప్ డైరెక్టర్‌తో నితిన్



హిట్టు కోసం తెగ కష్టపడుతున్న నితిన్, ఫ్లాప్ డైరెక్టర్ తో సినిమా చేయడానికి రెడీ అయ్యాడు. కాస్ట్యూమ్ డిజైనర్ గా పేరు తెచ్చుకున్న నీరజ కోన, 'తెలుసు కదా' సినిమాతో డైరెక్టర్ గా పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినా, నితిన్ ఆమెకు ఛాన్స్ ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. ఈ కొత్త కాంబినేషన్ ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.హిట్టు కోసం పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తున్న టాలీవుడ్ హీరోలలో నితిన్ ఒకరు. గత ఐదేళ్ళలో ఆయనకు ఒక్కటంటే ఒక్క మంచి కమర్షియల్ బొమ్మ పడలేదు. 'భీష్మ' తర్వాత మళ్లీ అలాంటి సక్సెస్ అందలేదు. 'చెక్', 'రంగ్ దే', 'మాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం','ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్', 'రాబిన్ హుడ్', 'తమ్ముడు '.. ఇలా వరుసగా పరాజయాలు చవిచూశారు. వచ్చిన సినిమా వచ్చినట్టే బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఈసారి ఎలాగైనా హిట్టు కొట్టి, సక్సెస్ ట్రాక్ ఎక్కాల్సిన పరిస్థితుల్లో నితిన్ ఓ ఫ్లాప్ డైరెక్టర్ తో వర్క్ చేయడానికి రెడీ అవ్వడం హాట్ టాపిక్ గా మారింది .కాస్ట్యూమ్ డిజైనర్‌గా సుపరిచితురాలైన నీరజ కోన.. 'తెలుసు కదా' అనే సినిమాతో డైరెక్టర్ గా ఇండస్ట్రీకి పరిచయమైన విషయం తెలిసిందే. సిద్ధూ జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ రొమాంటిక్ డ్రామా.. దీపావళి కానుకగా థియేటర్లలోకి వచ్చింది. ఈస్ట్రోజన్, టెస్టోస్టిరాన్ అంటూ న్యూ ఏజ్ స్టోరీతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులు కనెక్ట్ కాలేదు. దీంతో తొలి రోజే తిరస్కరించారు. ఓటీటీలోనూ ఈ సినిమాకి ఆశించిన స్థాయిలో ఆదరణ దక్కలేదు. దీంతో నీరజకి డెబ్యూతోనే నిరాశ ఎదురైంది. అయినప్పటికీ ఇప్పుడు హీరో నితిన్ ఆమెకు ఛాన్స్ ఇస్తున్నాడు.



# అధికార పార్టీదే ఆధిపత్యం

నిర్మల్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)

## నిర్మల్ జిల్లాలో అధికార పార్టీదే ఆధిపత్యం
## 136 స్థానాలతో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు
## ఉనికి చాటుకున్న బీఆర్ఎస్, బీజేపీ

నిర్మల్ జిల్లాలో గురువారం జరిగిన మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దదారులు అధిక సంఖ్యలో గెలుపొందారు . ఖానాపూర్ నియోజకవర్గం లోని కడెం దస్తురాబాద్ పెంబి ఖానాపూర్ మండలాలతో పాటు నిర్మల్ నియోజకవర్గంలోని లక్ష్మణ చందా మామడ మండలాల్లో మొత్తం 136 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా అధికారులు ఫలితాలను ప్రకటించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి 69 స్థానాలు దక్కగా బిజెపికి 22 , బీఆరెస్ 19 స్వతంత్ర అభ్యర్థులుగా మరో 26 మంది విజయం సాధించారు. నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడిగా ప్రాతినిథ్యం వహిస్తున్న ఖానాపూర్‌లో ఖానాపూర్ మండలంలో కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య నువ్వా నేనా అనే స్థితిలో ఎన్నికలు జరిగాయి కాంగ్రెస్ ఏడు స్థానాలు దక్కించుకోగా బీఆర్ఎస్ ఆరు స్థానాలు సాధించారు. అయితే ఇక్కడ పది ఇండిపెండెంట్‌లు విజయం సాధించగా బిజెపి రెండు స్థానాలకు పరిమితమైంది, కడెంలో కాంగ్రెస్ 15, బీఆర్ఎస్ 7 స్థానాలు దక్కించుకోగా బీజేపీకి ఒకే స్థానం దక్కింది. స్వతంత్రులు ఆరుగురు గెలిచారు. పెంబి మండలంలో 24 స్థానాల గాను కాంగ్రెస్ 15, బీజెపి ఒకటి బీఆర్ఎస్, ఏడు స్థానాలు ఇండిపెండెంట్లు ఐదు చోట్ల విజయం సాధించారు. దస్తురాబాద్ మండలంలో 13 స్థానాలకు గాను కాంగ్రెస్ ఎనిమిది, బీజెపి 2, బీఆర్ఎస్ రెండు, స్వతంత్రులు ఒక స్థానంలో విజయం సాధించారు, మామడ మండలంలో 27 పంచాయతీలకు గాను 17 కాంగ్రెస్, ఎనిమిది బీజెపి, 1 బీఆర్ఎస్, ఒకరు స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించారు. లక్ష్మణచందా మండలంలో 18 స్థానాలకు గాను కాంగ్రెస్ ఏడు, బిజెపి ఎనిమిది, స్వతంత్రులు మూడు చోట్ల విజయం సాధించగా, బీఆర్ఎస్ బోని చేయలేదు. బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న మామడ, లక్ష్మి మండలాల్లో బిజెపికి 16 స్థానాలు దక్కాయి..

**ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలు గుర్తించారు..**
**డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లలో ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడం వల్లనే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దదారులువిజయం సాధించారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారి గెలుపునకు కారణమయ్యాయని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రభుత్వం పై ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని ఎన్నికల ద్వారా మరోసారి రుజువైంది. కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను గెలిపించినందుకు ప్రజలకు అండగా ఉండి సేవ చేస్తామన్నారు.

## ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షణ
### కుమ్రంభీం అదనపు కలెక్టర్ దిపక్ తివారి

కెరమెరి, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)

రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మొదటి విడత పంచాయితీ ఎన్నికలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. గురువారం కెరమెరి, సిర్పూర్ (యు), జైనూర్, లింగాపూర్ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను పరిశీలించారు. ఓటర్లు భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో గదులు, ప్రహరీ గోడలు, విద్యుత్, ర్యాంప్ వంటి సదుపాయాలను పరిశీలించి, సూచనలు ఇచ్చారు.



## ఎంఎస్సీ చేసి సర్పంచ్‌గా విజయం సాధించి..

దండేపల్లి, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)



దండేపల్లి మండలం కర్నపేట గ్రామానికి చెందిన అజ్మీర సుభాష్ నాయక్ ఉన్నత చదువులు (ఎంఎస్సీ) పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం సాధించినప్పటికీ తన గ్రామ ప్రజలకు సేవ చేయాలనుకున్నాడు. అదే లక్ష్యం తో 2025 సర్పంచ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా భరిలో నిలిచి కర్నపేట తండా సర్పంచ్ అభ్యర్థిగా 6 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు .కర్నపేట గ్రామానికి అన్ని విధాల అభివృద్ధి చేసి నన్ను సర్పంచ్ గా గెలిపించిన గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయ న స్పష్టం చేశారు.ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచి, సర్పంచ్‌గా గెలిచిన సుభాష్ నాయక్‌కు గ్రామస్తులు అభినందించారు.

## దాబా(బి)లో 7 ఓట్లతో సర్పంచ్‌గా కొడప కన్ను

గాదిగూడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)

గాదిగూడ మండలంలోని దాబా(బి) గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఉత్కంఠంగా పోటీ జరిగింది. సర్పంచిగా కొడప కన్ను కేవలం 7 ఓట్ల తేడాతో మాణిక్రావుపై విజయం సాధించారు. ఆయన గెలుపుపై పలువురు అభినందించారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా జ్యాగ్నాక్ లింబా రావును వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం గ్రామంలో ఆయన అనుచరులతో ఘనంగా సంబరాలు చేసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సారంగాపూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)

సారంగాపూర్ మండలం ధని గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి రాజేందర్ మృతి చెందారు. బుధవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా, మూలమలుపు వద్ద అడవి పందులు ద్విచక్ర వాహనానికి అడ్డు రావడంతో కింద పడిపోయి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు.



## లక్కీ డ్రాతో సర్పంచ్‌గా గెలిచిన ఈశ్వర్



ఇచ్చోడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)

ఇచ్చోడ మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. గురువారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో దాబా(బీ) గ్రామంలో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు ఈశ్వర్, రామేశ్వర్‌కు సమానంగా 176 ఓట్లు సమానంగా ఓట్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. దీంతో లక్కీ డ్రా ద్వారా ఈశ్వర్‌ను సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించడం జరిగిందని అధికారులు తెలిపారు.



# కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తొలి విడత
# పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

**అత్యధికంగా కెరమెరిలో 83.38 శాతం**
**106 పంచాయతీల్లో ఓటు హక్కు వినియోగించుకున్న 76,668 మంది ఓటర్లు**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా గురువారం జరిగిన తొలి విడత ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జైనూరు, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, వాంకిడి మండాలాల్లోని 114 గ్రామ పంచాయతీలకు గాను ఇప్పటికే ఏడు పంచాయతీలు ఏకగ్రీవం కాగా వాంకిడి మండలంలోని తేజగూడ గ్రామపంచాయతీకి నామినేషన్ దాఖలు కాకపోవడంతో గురువారం 106 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. జిల్లాలో చలి తీవ్రత కారణంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా జరిగింది. ఆ తర్వాత పుంజుకుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 19.2 శాతం పోలింగ్ నమోదు కాగా 11 గంటల వరకు 59.11 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 77.85 శాతం పోలింగ్ నమోదు కాగా పోలింగ్ సమయం ముగిసే వరకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోగ జిల్లాలో మొత్తం 79.81 శాతంగా పోలింగ్ నమోదైంది .జిల్లాలో అత్యధికంగా కెరమెరి మండలంలో 83.38 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా జైనూరు మండలంలో 76.81 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సందర్భంగా ఎక్కడ ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకొలేదు. జైనూరు మండలం లో 24,362 మంది ఓటర్లకు గాను 18,713 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కెరమెరి మండలంలో 22,993 మందికి గాను 19,171 మంది, లింగాపూర్‌లో 8,867 మందికి గాను 7,059 మంది, సిర్పూర్(యూ)లో 12,277 మందికి గాను 9,966 మంది, వాంకిడిలో 27,568 మందికి గాను 21,760 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తొలి విడత ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏఎస్పీ చిత్తరంజన్‌లు సందర్శించి పోలింగ్



సరళిని పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాల ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించారు.



## సింగరేణి దినోత్సవ వేడుకలకు
## ఘనంగా ఏర్పాటు చేయాలి

**మందమర్రి, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మందమర్రి ఏరియాలో ఈనెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా జిఎం రాధాకృష్ణ అధికారులకు సూచించారు. గురువారం జిఎం కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో వేడుకల్లో కంపెనీకి సంబంధించిన స్టాల్స్, వివిధ రకాల ఆహార స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని తెలిపారు.

## విజయోత్సవ ర్యాలీలను
## నిర్వహించిన వారిపై కేసు

**ఇచ్చోడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండలం నవేగాంలో గెలుపొందిన సర్పంచ్ ముండే పాండురంగ్ తో పాటు 20 మందిపై, ఉట్నూర్ మండలం దంతన్పల్లి సర్పంచ్ అభ్యర్థి భర్త భూమన్న, అనుచరులు కోమటిరెడ్డి మల్లారెడ్డి మరికొందరిపై విజయోత్సవ ర్యాలీ నిర్వహించినందుకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్పి కాజల్ సింగ్ తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘన, 223 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించరాదని ఏఎస్పీ హెచ్చరించారు.

# సర్పంచ్ అభ్యర్థులపై కేసు నమోదు

**ఇచ్చోడ సీఐ బండారి రాజు**

**ఇచ్చోడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ నందు ఉపసర్పంచ్ కార్తీక్ ముండై గెలిచిన సందర్భంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన అనుచరులపై కేసు నమోదు చేసినట్టు ఇచ్చోడ ఎస్‌హెచ్‌వో సీఐ బండారి రాజు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆరు మండలాలలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలో నిర్వహించరాదని ఇచ్చోడా ఎస్హెచ్ఓ సీఐ బండారి రాజు తెలియజేశారు. ఉప సర్పంచ్ అభ్యర్థి ముండే కార్తీక్, గుండె సాయి హరి, ముస్లె కేర్బా, సిదాం జంగు, జుగ్నాక్ కృష్ణ, ఇంకా 20 మంది పై 30 పోలీస్ ఆక్ట్ ఉల్లంఘన, 223 బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మరి ఎవరైనా ఇచ్చోడా మండలాలలో నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలను నిర్వహించిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని హెచ్చరించారు. విజయాల అనంతరం టపాకాయలను వెలిగించరాదని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు చేయడం నిషేధం. గెలుపొందిన అభ్యర్థులు అనంతరం సంబంధిత అధికారుల వద్ద సరైన నిర్దేశిత రోజున అనుమతులు తీసుకొని రాలీలను నిర్వహించవచ్చని వెల్లడించారు.

# బైకు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**బోథ్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మండలంలోని చిన్న దన్నూర్ సమీపంలో గురువారం రాత్రి బైకు ప్రమాదం జరగడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తి వ్యవసాయ పొలం నుండి రోడ్డు వైపు వస్తుండగా అడెల్లి నుండి వస్తున్న బైకు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరగడం తో గాయపడిన స్వరాజ్,మచ్చర్ల నరేష్, మహేష్ లను స్థానికులు 108 అంబులెన్సు లో బోథ్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అయితే ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారని గాయపడిన వారు బిర్లాగొంది, కుచులాపూర్ గ్రామాలకు చెందిన వారని తెలిపారు.





## ఒక్క ఓటు తేడాతో
## స్వతంత్ర అభ్యర్థి విజయం

**కెరమెరి, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఒక్క ఓటతో 'ఆమె'ను గెలుపు వరించింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని వివాదాస్పద గ్రామమైన పరందొలి గ్రామ పంచాయతీ సర్పంచిగా రారోడ్ పుష్పలత కేవలం ఒక్క ఓటుతో ప్రత్యర్థి దీలిప్ కాటేపై గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి వెంకటస్వామి ప్రకటించారు. ఈ గ్రామ పంచాయతీలో మొత్తం 873 ఓటర్లు ఉన్నారు. ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. కాటే దీలిప్కు 101 ఓట్లు రాగా, పుష్పలతకు 102 ఓట్లు పోలయ్యాయి. ఒక్క ఓటు తేడాతో ఆమెకు విజయం దక్కింది. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## మోతి పటార్ సర్పంచ్‌గా
## స్వతంత్ర అభ్యర్థి గెలుపు

**లింగాపూర్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం మోతి పటార్ సర్పంచ్‌గా స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ సునీత సమీప అభ్యర్థిపై 80 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లందరికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, గ్రామ అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

## మేడిగూడ సర్పంచ్‌గా ఆనందరావు

**గాదిగూడ, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
గాదిగూడ మండలంలోని మేడిగూడ గ్రామపంచాయతీ సర్పంచిగా కొడప ఆనందరావు గెలుపొందారు. ప్రత్యర్థి జంగుపై 197 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆ గ్రామపంచాయతీలో మొత్తం 8 వార్డులు ఉండగా.. 7 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగితా 1 వార్డుకు ఎన్నిక జరగ్గా.. వాఘ్మారే ధన్రాజ్ గెలుపొందారు. ఉపసర్పంచిగా బన్సుడే యశ్వంత్‌ను ఎన్నుకున్నారు.

# రిమ్స్ ఆస్పత్రిలో తల్లీబిడ్డల మృతి

**మగబిడ్డ పుట్టాడన్న ఆనందం.. అంతలోనే ఆవిరి**
**ప్రసవ సమయంలో బాలింత నవజాత శిశువు మృతి**
**వైద్యుల నిర్లక్ష్యమే అంటూ కుటుంబ సభ్యుల ఆందోళన**

**ఆదిలాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత సమాచారం)**
మగ బిడ్డ పుట్టాడనే ఆనందం ఆ కుటుంబంలో ఎంతో సేపు నిలలేదు. ప్రసవం అయిన కొద్ది సేపటికే తల్లి తో పాటు పుట్టిన బిడ్డ మృతి చెందిన విషాద ఘటన ఆదిలాబాద్ రిమ్స్ లో చోటు చేసుకుంది. పుట్టిన వెంటనే పసికందు మృతి చెందటం, తరువాత కొద్ది సేపటి వ్యవధిలో ఆ బాలింత కూడా మృతి చెందటం కుటుంబంలో తీవ్ర విషాదం మిగిల్చింది. తల్లి బిడ్డల మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కుటుంబీకుల వివరాల ప్రకారం... ఉట్నూర్ మండలం హస్నా పూర్ పీహెచ్సీ పరిధిలోని పట్లగూడ గ్రామానికి చెందిన మూతి గంగశీల (34) అనే గర్భిణి ప్రసవం కోసం ఈనెల 9న రిమ్స్ లో చేరింది. బుధవారం రాత్రి పురిటి నొప్పుల రావడంతో వైద్యులు డెలివరీకి ఏర్పాట్లు చేశారు. గురువా రం తెల్లవారు జామున మగబిడ్డకు జన్మనిచ్చింది. కొద్ది సేపటికే శిశువు మృతి చెందగా బాలింత, కుటుంబీకులు తట్టుకోలేకపోయారు. అయితే దీనికి తోడు బాలింత కూడా కొద్ది సేపటికి అనూహ్యంగా తనువు చాలించింది. ఇక కుటుంబ సభ్యుల బాధ వర్ణణాతీతం. కాగా ఇద్దరు ఆడపిల్లలు కాగా మగబిడ్డ జన్మించాడని ఎంతగానో సంతోషించినా కుటుంబ సభ్యుల సంతోషం క్షణల్లోనే ఆవిరి అయింది. తల్లీబిడ్డలు మృత్యువు ఒడిలోకి చేర్చటంతో వారి రోదనలు మిన్నంటాయి. ఇదిలా ఉంటే తల్లి బిడ్డల మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం అంటూ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కుటుంబీకులు రిమ్స్ మార్చురీ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ఏజెన్సీ వైద్యాధికారి డాక్టర్ మనోహర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, టుటౌన్ సీఐ నాగరాజ్ మార్చురీ చేరుకుని వారిని మాట్లాడి సముదాయించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతున్నామని డైరెక్టర్ వివరించారు.

